క్లుప్తంగా

బోనాల జాతరను విజయవంతం చేయాలి

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 22న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై కట్ట మైసమ్మ గుడి వద్ద కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బోనాల జాతరను విజయవంతం చేయాలని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బాడిశ శంకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో జరగనున్న మొదటి జాతరకు భక్తులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో మల్లెల శ్రీనివాస్, సైదులు, కేఆర్ఎం కుమార్, కొరం పల్లి సత్యనారాయణ, పురిటి వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐలు



ఎమ్మెల్యే వనమాను కలిసిన సీఐలు

కొత్తగూడెంటౌన్: రామవరం టూటౌన్ పోలీసు స్టేషన్ సీఐగా టీ.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సీఐల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీసీఆర్బీలో పని చేస్తున్న రమేష్ కొత్తగూడెం టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.
పాల్వంచ: పాల్వంచ సీఐగా వినయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కమిషనరేట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీఐ పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు.

పెనగడపలో తాగునీటి బోర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పెనగడపలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొనగా తాగునీటి అవసరాలకు బోర్ వేయించాలని స్థానికులు కోరారు. దీంతో ఆయన సూచనల మేరకు ఏరియా జీఎం జక్కం రమేష్ శుక్రవారం బోర్ వేయించారు. ఈ బోర్‌లో నీటిని హైడ్రాలజిస్ట్ ఆర్.రమేష్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. పెనగడప సర్పంచ్ కళావతి, కార్యదర్శి హన్మంతుతో పాటు ఎండీ రజాక్, నాగరాజు, రాజరత్నం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సుజాతనగర్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బేతంపూడి గ్రామంలోని 4వ వార్డుకు చెందిన ప్రజలు ఎంపీఓ ఖాజా మొహీనుద్దీన్‌ఖాన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. నెలల తరబడి తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వార్డు పరిధిలో దిగువన ఉన్న 15 కుటుంబాల వారికి సరఫరా కావడం లేదన్నారు. మరో మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు.

మొబైల్ హెల్త్ క్యాంప్

పాల్వంచరూరల్: మండల పరిధి ఉల్వనూరులో శుక్రవారం జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొబైల్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దివ్య, వాణి, ప్రవీణ్, షాలీమ్, రమేష్ 250 మందికి స్క్రీనింగ్ టెస్ట్‌లు, రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్, డెంటల్ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ వాసం రుద్ర, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డిజిటల్ మనీపై అవగాహన

కొత్తగూడెంరూరల్: చాంతకొండలోని 6వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌బీఐ సీనియర్ అకౌంటెంట్ ఎం.అరవింద్, సీహెచ్ శివరెడ్డి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ మనీ ట్రాన్సాక్షన్ నుంచి ఏర్పడే మోసాల గురించి బెటాలియన్ పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా మెళకువలు పాటించాలని సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళీదాసు, వీరన్న, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పట్టణాలు ప్రకాశవంతం

- అభివృద్ధి దిశగా పరుగులు
- ఘనంగా పట్టణ ప్రగతి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, మున్సిపాలిటీ కమిషనర్లు, చైర్మన్లు
- త్వరలో రూ.115 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బతుకమ్మలతో ర్యాలీగా వస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా, ప్రజాప్రతినిధులు, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీని నంబర్ వన్‌గా నిలపాలని, ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు రూ.115 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పథకాలకు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన పట్టణ ప్రగతి దినోత్సవంలో కలెక్టర్ అనుదీప్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. వనమా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో కొత్తగూడెం మున్సిపాలిటీలో అభివృద్ధి సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.
కరోనా కష్టకాలంలో మున్సిపల్ సిబ్బంది ప్రజలకు విశేషమైన సేవలు అందించిన వారి సేవలకు సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది విధులు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి పనులతో ఎంతో ప్రగతి సాధించినట్లు తెలిపారు. మనం చేసిన పనులు ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం సువర్ణ అవకాశమన్నారు. నాగరిక ప్రపంచంలో మున్సిపాలిటీలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని కొత్తగూడెంలోని ఎంజీ రోడ్డు నుంచి రామవరం వరకు పచ్చని చెట్లు, డివైడర్లు రోడ్డు చుట్టూ హరితవనంగా కనిపిస్తూ పచ్చదనాన్ని సంతరించుకున్నాయని చెప్పారు. నేటి యువతను క్రీడల్లో ప్రపంచ స్థాయి ఆటగాళ్లుగా తయారు చేయడానికి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, రెండు టెన్నిస్ కోర్టులు, బ్యాడ్మింటన్ కోర్టు వంటి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో పాటు రన్నింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్‌చైర్మన్ దామోదర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, మున్సిపల్ కమిషనర్ రఘు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ కార్మికులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పట్టణాల్లో కొత్త శోభ సంతరించుకుందని, అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ ర్యాలీని ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్‌లు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ నుంచి మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన సభ వద్దకు చేరుకుంది. కమిషనర్ పట్టణ అభివృద్ధి నివేదికను సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సఫాయి అన్న.. సలాం అన్న.. ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం బ్యాంకర్లకు, వీధి వ్యాపారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి, వికలాంగ, మహిళా సమైక్యలు, కళాకారులకు, ఇతర కార్యాలయ సిబ్బందిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందించారు. కమిషనర్ మాట్లాడుతూ హరిత హారం, ప్రకృతి వనాలు, ఇంటింటికి చెత్త సేకరణ, రోడ్లు విస్తరణ, చెత్త రీసైక్లింగ్ సెంటర్‌లు, క్రీడామైదానాలు, జంక్షన్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థలో మార్పులు, రోడ్లు తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, తహసీల్దార్ రంగాప్రసాద్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పురంధర్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి సంజీవరావు, డీఈ మురళీ, ఏఈ రాజేశ్, క్రీడాకారిణి సింధు తపస్వీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, టీపీఓ సత్యనారాయణ, సీడీపీఓ కనకదుర్గ పాల్గొన్నారు.



పాల్వంచ: మున్సిపాలిటీలో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ అనుదీప్



పాల్వంచ: పారిశుద్ధ్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న కమిషనర్ శ్రీకాంత్



కొత్తగూడెంఅర్బన్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దర్గాలో ఎమ్మెల్యే పూజలు



పూజ చేస్తున్న హరిప్రియ

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియా సయ్యద్ షా మాస్కుల్లా రబ్బానీ దర్గాలో శుక్రవారం నిర్వహించిన జెండా పండుగకు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దర్గాలో ఎమ్మెల్యే సంప్రదాయంగా ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం దర్గా నిర్వాహకులు చేపట్టిన గ్యార్మీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు తాంచ్ర నాగరాజు, ముస్తఫా, రెంటాల సదానందం, ఖమ్మంపాటి రేణుక, శ్రీనివాసరెడ్డి, ఘాజీ, చిన్నారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న రవికుమార్

పాల్వంచ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇంటూరి రవికుమార్ అన్నారు. శుక్రవారం పాల్వంచలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 18న పాల్వంచలోని టీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9గంటల నుంచి ఎంపికలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు 17తేదీ నాటికి పేర్లు నమోదు చేయించుకోవాలని, ఎంపికలకు వచ్చే క్రీడాకారులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 9177323108, 9866793238 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సావిత్రి, పి.హరిప్రసన్న కుమార్, కె.రమేశ్, నారందాసు వెంకటేశ్వర్లు, గరికె యాదగిరి, రాజ్‌కుమార్, వరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.33తో బతికేదెట్లా?



మాట్లాడుతున్న ప్రసాద్

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్ డే మీల్స్ తయారు చేసే సిబ్బందికి ప్రభుత్వం రోజుకు రూ.33 మాత్రమే చెల్లిస్తోందని దీంతో వారి కుటుంబ జీవనం గడిచేదెట్లా అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఈనెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయని, వంటచేసే సిబ్బంది జీతాలు పెంచి, పెండింగ్‌లో ఉన్న బిల్లులు అందించే వరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేది లేదని హెచ్చరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం 'పెరిక'లను గుర్తించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్రంలోని పెరిక కులస్తులు రాజకీయంగా, విద్య, క్రీడా తదితర రంగాల్లో ముందుండాలని రాష్ట్ర నాయకులు లక్కరసు ప్రభాకర్ అన్నారు. మండల పరిధి పెద్దమ్మగుడి వద్ద శుక్రవారం జిల్లా ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం వెనుకబడి ఉన్న పెరిక కులస్తులను గుర్తించి బీసీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బరపటి ప్రసాద్, పూజారి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా సంగెం భాను మండలాల నుంచి నియమించిన నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, బొలిశెట్టి రంగారావు, మన్నె వెంకన్న, కుంచాల రాజారాం, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, చిట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ఇల్లెందురూరల్: ప్రతిరైతుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పారా లీగల్ వలంటీర్ సతీష్‌ఖండేల్‌వాల్ అన్నారు. మండలంలోని సుదిమళ్ల రైతు వేదికలో శుక్రవారం రైతులతో న్యాయ సలహా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే దళారులు, వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులకు అంటగట్టి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, కొనుగోలు చేసిన తరువాత తప్పక రశీదులను తీసుకోవాలని సూచించారు.

'ఉపా' కేసుల నమోదుపై నిరసన



సింగరేణి(కొత్తగూడెం): కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలో ప్రజాసంఘాలు, రచయితలు, ప్రజాహక్కుల సంఘాల నేతలపై 'ఉపా'కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక రైటర్ బస్తీలు శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. పౌరహక్కుల నేత హరగోపాల్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, అరుణోదయ విమల, పద్మజ, హక్కుల నేతలు లక్ష్మణ్ నారాయణ తదితరులపై ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్.సంజీవ్, కందగట్ల సురేందర్, ఇర్పా రాజేష్, కరుణక్క, పద్మ, నాగలక్ష్మి, కృష్ణ, నరసింహా, కొండ వెంకటరత్నం పాల్గొన్నారు.
టేకులపల్లి: ప్రజా నాయకులు పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు 152 మందిపై అక్రమంగా దేశద్రోహం కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని పీవైఎల్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి నోముల భానుచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఎట్టి నరసింహారావు, రాంచందర్, సమ్మయ్య, కోటిలింగం, వినోద్, వెంట్రామ్‌ల అక్రమ అరెస్టులను ఖండించారు. ప్రజా నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
ఇల్లెందురూరల్: సంఘాలు, రచయితలు, హక్కుల సంఘాల నేతలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఉపా కేసు నమోదు చేయడం దుర్మార్గమని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. ఎన్ఐఏ చర్యలను నిరసిస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. తుపాకుల నాగేశ్వరరావు, ప్రకాష్, సక్రు, జానకి, మోహన్‌రావు, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెలవుదినంగా ప్రకటించాలి

జూలూరుపాడు: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జరగనున్న గిరిజన పండుగ సందర్భంగా శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ కేశవ్ నాయక్ కోరారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. లంబాడీ గిరిజనుల పండుగలైన సీత్లా(దాటుడు) పండుగను సెలవుదినంగా ప్రకటించాలన్నారు. గిరిజన బంధు పథకానికి తక్షణమే నిధులు కేటాయించాలని కోరారు. ఎస్టీ జాబితాలో బీసీ తెగలను చేర్చే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్ఎంఎస్ రీజియన్ కార్యదర్శిగా రాంశంకర్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శిగా రాంశంకర్ కోరి నియమితులయ్యారు. పీవీకే–5షాఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆయన నియామకాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. ప్రకటించారు. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన యూనియన్ సమావేశంలో రాంశంకర్‌ను నియమించినట్లు వెల్లడించారు.

పథకం ప్రకారమే అవమానం

ఇల్లెందు: అందరినీ కలుపుకుని పోవాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ప్రొటోకాల్ పాటించకుండా పథకం ప్రకారం సభలో అవమానిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పట్టణ ప్రగతి సంబురాల కార్యక్రమం శుక్రవారం మార్కెట్ యార్డులో జరిగింది. ఈ సభలో వేదిక మీదకు అతిథుల ఆహ్వానంలో ప్రొటోకాల్ పాటించలేదని వాపోయారు. ఈ విషయమై కమిషనర్‌కు ప్రశ్నించగా.. గమనించలేదని చెప్పడం విడ్డూరం అన్నారు. ఇదిలా ఉండగా సభలో ఉపన్యాసం ముగింపులో కారు గుర్తుకు ఓటు వేయమని, హరిప్రియను గెలిపించమని ఇదే వైస్ చైర్మన్ చెప్పడంతో పట్టణ సంబురాలను ఎన్నికల సభగా మార్చారని స్థానికులు గుసగుసలాడుకున్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రైతు బజార్‌లో తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ మనోహర్ శుక్రవారం ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, బాట్లతో తూకాలకు సంబంధించిన వ్యత్యాసాలను వివరించారు. రెండింటి తూకాలలో వినియోగదారులకు మోసం జరుగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సమాచార హక్కుల చైతన్య వేదిక అధ్యక్షుడు రఘుమాచారి, రైతుబజార్ వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు మంచినీటి దినోత్సవం

జూలూరుపాడు: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న ఖమ్మం జిల్లా కల్లూరు కనకగిరి గుట్టల వద్ద గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద జరిగే మంచినీటి దినోత్సవ వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని ఇంట్రా విలేజ్ ఏఈ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం ఉదయం మండల కేంద్రంలో ఉదయం 8 గంటలకు ర్యాలీ నిర్వహించిన అనంతరం వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

హెచ్ఐవీ రహిత దేశంగా మారుద్దాం..



ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

టేకులపల్లి: దేశాన్ని హెచ్ఐవీ రహిత దేశంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బేతంపూడి సర్పంచ్ యదళ్లపల్లి బాబు, చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ మధు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బేతంపూడి గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. బేతంపూడిని ఆరోగ్య పంచాయతీగా మార్చేందుకు సహకరించాలని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఐవీ పట్ల అపోహలు వదిలేయాలని, హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం అందరికీ రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మీనాకుమారి, ఏఎన్ఎం ఎల్లమ్మ, లక్ష్మి, మంగ, లలిత, స్వరూప, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉడకని 'మధ్యాహ్న భోజనం'



యానంబైల్ హైస్కూల్‌లో ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు మూడు రోజులుగా పెట్టడం లేదు. మండలంలోని పాండురంగాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలోని ప్రాథమిక పాఠశాల, యానంబైల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు పెట్టకపోవడంతో విద్యార్థులు అర్ధ కాలితో అవస్థలు పడుతున్నారని ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా.. హెచ్ఎంలు జోక్యం చేసుకుని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు పెట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొత్తగూడెం ఏరియాలో స్వచ్ఛ పక్వాడా



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న ఏరియా జీఎం రమేష్



టేకులపల్లి: కేవోసీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జూన్ 16 నుంచి 30వ తేదీ వరకు స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయ పరిధిలోని వివిధ విభాగాలలో స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛ పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. జీఎం మాట్లాడుతూ.. ఇంటి వద్దే కాకుండా, పని స్థలాలు అన్ని ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సింగరేణి సీ అండ్ ఎండీ ఎన్.శ్రీధర్ సూచనల మేరకు ఈరోజు ఏరియాలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏరియాలోని అన్ని విభాగాల హెచ్ఓడీలు కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం పర్సనల్ సామ్యుల్ సుధాకర్, డీజీఎం (ఐఈ) యోహాన్, డీజీఎం (సర్వే) సదానందం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏరియా పీవీకే–5షాఫ్ట్ గని ఆవరణలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించి కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, కూసన వీరభద్రం, చిలక రాజయ్య పాల్గొన్నారు.
టేకులపల్లి: సింగరేణి యాజమాన్యం ఆదేశాల మేరకు ఈనెల 30 వరకు నిర్వహించనున్న స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం శుక్రవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో నిర్వహించారు. ఈ మేరకు తొలిరోజు కార్యక్రమాన్ని కేఓసీ మేనేజర్ సౌరభ్ సుమన్ ప్రారంభించారు. స్వచ్ఛ పక్వాడాపై అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. మేనేజర్ మాట్లాడుతూ.. కార్యాలయాలు, ఆఫీసు చుట్టు పక్కల ప్రదేశాలు, కాలనీలు తరుచూ ఉపయోగించే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా చాలా అవసరమని చెప్పారు. డిప్యూటీ మేనేజర్ ఉండం బ్రహ్మం, పిట్ కార్యదర్శి అశోక్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా భారీ వృక్షం..



టేకులపల్లి మండల కేంద్రం పోస్టాఫీసు సెంటర్‌లో భారీ చింత చెట్టు ప్రమాదకరంగా ఉంది. మానవాళి మనుగడకు చెట్లే ఆధారం అయినప్పటికీ ఇది చాలా ఏళ్లకాలం నాటిది. గాలివానలకు చెట్టు కొమ్మలు విరిగి చెట్టుపక్కల ఇల్లు, దుకాణాలపై పడుతున్నాయి. ఇదే ప్రదేశంలో రోడ్డుపై డివైడర్ లేకపోవడంతో వాహనాలు మలుపు తిరిగే సమయంలో చెట్టును ఢీకొట్టిన సంఘటనలు ఉన్నాయి. ఈ చెట్టు వద్దనే వాహనాలు నిలుపుతుండటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చెట్టుని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
\- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : ఎల్.కిరణ్‌కుమార్,
కార్యదర్శి, టేకులపల్లి
సెల్ నెంబర్: 80080 18031